క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని 79 ఏ చింతమాకుల పల్లె పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ ప్రకాశంరెడ్డి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన పార్థివదేహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతమ్మ బుధవారం నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున ఉన్నారు.

పలమనేరులో 2 నామినేషన్లు

పలమనేరు: పలమనేరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శివశంకర్, ఆయన సతీమణి ఉషా రెండు నామినేషన్లు వేసినట్టు రిటర్నింగ్ ఆఫీసర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. గురువారం నామినేషన్ల ఘట్టం ముగియనుంది.

కుప్పంలో 7..

కుప్పం: సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో బుధవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కృష్ణా రాఘవ జయేంద్ర భరత్ 4వ సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి శ్రీనివాసులు అందజేశారు. భరత్ నామినేషన్‌ను మురుగేష్ ప్రతిపాదించారు. టీడీపీ అభ్యర్థి చంద్రబాబు తరపున 3వ సెట్‌ను చిత్తూరుకు చెందిన న్యాయవాది వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల గోవిందరాజులు రెండవ సెట్‌ను వేశారు. వీసీకే పార్టీ తరపున గోవిందరాజులు 2వ సెట్టు, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఆర్వో శ్రీనివాసులకు అందజేశారు.

ఎలక్షన్ గేమ్ ఛేంజర్లు మహిళలే

పలమనేరు: వచ్చే సాధారణ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గంలో మహిళల ఓట్లే కీలకంగా కానున్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,66,739 ఉన్నారు. వీరిలో పురుషులు 1,32,020 కాగా మహిళలు1,34,717. మహిళా ఓటర్ల సంఖ్య కాస్త ఎక్కువగా ఉండటంతో గత అసెంబ్లీ ఎన్నికలకంటే ఈపర్యాయం వాటి ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహిళా ఓటర్లలో చైతన్యం వస్తేనే ఎన్నికల ఫలితాలు స్పష్టంగా ఉంటాయని, వీరి గేమ్ ఛేంజర్లగా మారడం ఖాయమని పలువురు సీనియర్ నాయకులు అంచనా వేస్తున్నారు.

ఆటో, బైక్ సహా కర్ణాటక మద్యం సీజ్

- ఒకరి అరెస్టు, ఇద్దరు పరారీ

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు క్వారీ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆటోను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం .. మండలంలోని పుంగనూరు-అప్పినపల్లె మార్గంలోని పెద్దవెలగటూరు క్వారీ వద్ద ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో శంకర్రాయలపేటకు చెందిన ఆటో డ్రైవర్ బాలాజీ కర్ణాటక రాష్ట్రం హెబ్బిని నుంచి ఆటోలో 672 ఒరిజినల్ చాయిస్ 90ఎంఎల్ కర్ణాటక మద్యం ప్యాకెట్లను తీసుకుని వస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఆటోకు ఎస్కార్టుగా బైక్‌లో వస్తున్న చిన్నప్పరెడ్డిపల్లెకు చెందిన సుబ్రమణ్యం, శంకర బైక్ వదిలి పారిపోయారు. కర్ణాటక మద్యం, బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మనిషికి రూ.500 + బిరియాని!

- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌కు ఇదీ రేటు
- కర్ణాటక, తమిళనాడు నుంచి అద్దె జనం



చెట్ల కింద కర్ణాటక అద్దె జనం

పలమనేరు: పలమనేరులో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్ నామినేషన్‌కు కర్ణాటక, తమిళనాడు నుంచి అద్దె జనాలను ప్రైవేటు బస్సుల్లో తరలించారు. కర్ణాటకలోని బేతమంగళ, హుల్కూరు, నంగిలి, నగవార తమిళనాడులోని సామచేనుమిట్ట, పేర్నాంబట్ పరిసర గ్రామాల నుంచి ఇక్కడికి రప్పించారు. ఒక్కో మనిషికి రూ.500, బిర్యానీ ప్యాకెట్ ఇస్తామని, నామినేషన్ వేశాక బస్సులెక్కినప్పుడు ఇచ్చేలా డీల్ కుదుర్చుకున్నారు. ఒక్కో వాహనానికి ఓ మహిళను ఇన్‌చార్జిగా పెట్టి, వారు పేర్లు రాసుకుని మ రీ కూలికి జనాన్ని రప్పించడం విశేషం! వీరంతా కన్నడ, తమిళంలో మాట్లాడుతూండటం..గతంలో ఎప్పుడూ చూడని ఈ కొత్త ముఖాలను చూసి స్థానికులు ఈ కాంగ్రెస్ క్యాండిడేట్‌కి ఏమి నసరా స్వామీ అని చర్చించుకోవడం కనిపించింది.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు

పలమనేరు: స్థానిక రంగాపురం శ్రీ శారదా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ టెన్త్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు అధినేత క్రిష్ణారెడ్డి తెలిపారు. పరీక్షలు రాసిన 70మందీ పాసయ్యారని, వీరిలో జదేన్‌ఖాన్ 585, పవన్‌కుమార్575, భార్గవ్ 574, హాసిని 574 మార్కులు సాధించారని, అలాగే 500 పైచిలుకు మార్కులు 41మంది సాధించినట్టు పేర్కొన్నారు.

జన సంద్రం నడుమ భరత్ నామినేషన్

- వేలాదిగా హాజరైన జనం
- కిక్కిరిసిన రోడ్లు
- ఉత్సాహంతో ఉరకలేసిన మహిళలు, యువకులు



మండుటెండ అయినా చెక్కుచెదరని అభిమానం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్, వెంకటేగౌడ



ర్యాలీలో కోలాట కళాకారుల ప్రదర్శన

కుప్పం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కృష్ణ రాఘవ జయేంద్ర భరత్ నామినేషన్ (కేఆర్‌జే భరత్) జన సంద్రం నడుమ అట్టహాసంగా సాగింది. బుధవారం భరత్ నామినేషన్ కోసం నియోజకవర్గం నలుమూలల నుంచి జనం భారీగా తరలివచ్చారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు రావడంతో కుప్పం జనజాతరను తలపించింది. ఉదయం 9 గంటలకే జనం రోడ్లపై నిలబడి జగనన్న , భరత్‌కు జేజేలు కొడుతూ నినాదాలు చేయడం, గుంపుగా నృత్యం చేయడం కనిపించింది. భరత్ ఒంటి గంటకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి రోడ్‌షోతో నామినేషన్‌కు కదిలారు. దీంతో పట్టణంలో ఒక్కసారిగా 'జై జగన్... జైజై జగన్' అంటూ మార్మోగింది. రోడ్డు పొడవునా పూల వర్షంతో ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఉత్సాహంతో ఉరకలేసిన యువత

భరత్ నామినేషన్ కోసం నియోజకవర్గం వ్యాప్తంగా తరలివచ్చిన యువకులు ఉత్సాహంతో ఉరకలేశారు. వై ఎస్సార్ సీపీ జెండాలు చేతబూని, పలక వాయిద్యాల మధ్య.. జై జగనన్న అంటూ నృత్యాలు చేస్తూ రోడ్‌షోలో సాగారు. మహిళలు సైతం జగనన్న 'జెండాలు జతకట్టడమే మీ అజెండా... జన గుండెల్లో గుడి కట్టడమే జగన్ అజెండా' పాటకు ఉత్సాహంతో నృత్యం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వరకు మూడు కిలోమీటర్ల దూరం ఇసుక వేస్తే రాలనంత జనంతో ర్యాలీ సాగింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు ర్యాలీలో కదం తొక్కారు.



జెండాలతో యువత కేరింతలు

కిక్కిరిసిన వీధులు

కుప్పం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బుధవారం కుప్పం రోడ్లన్నీ కిక్కిరిశాయి. పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నేతాజీ రోడ్డు మార్గంలోనే కాకుండా ప్యాలెస్ రోడ్డు, హెచ్‌పీ రోడ్డు, మల్లానూరు, డీకేపల్లె రోడ్లన్నీ వైఎస్సార్ సీపీ జెండాలతో రెపరెపలాడాయి.

చంద్రబాబును చిత్తుగా ఓడించండి

ఈ పర్యాయం ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును చిత్తుగా ఓడించి కుప్పం నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని రోడ్‌షోలో ప్రజలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. రోడ్‌షోలో భరత్‌తోపాటు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సిపాయి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు.. ఉత్తమ ఫలితాలు చూడు

- పది పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు
- మెరుగైన సౌకర్యాలు, ఉన్నత ప్రమాణాల విద్యాబోధన
- బడుల అభివృద్ధికి పది ఫలితాలే సాక్ష్యం



పలమనేరు బాలికోన్నత పాఠశాల

పలమనేరు: సోమవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల సత్తాచాటాయి. ప్రైవేటుగా దీటుగా ఫలితాలను సాధించాయి. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వం ప్రభుత్వ బడులు రూపురేఖలు సమగ్రంగా మార్చింది. మౌలిక వసతులు మెరుగు పరిచి, విద్యాకానుక పేరిట విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, షూలు మొదలైన వాటిని అందజేసింది. బోధన ప్రమాణాల స్థాయిని కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా తీసుకెళ్లింది. ఇవన్నీ ఉత్తమ ఫలితాల సాధనకు దోహదం చేశాయి.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గంగవరం మండలం ఓవరాల్‌గా 95శాతం ఉత్తీర్ణత సాధించి టాప్‌లో నిలిచింది. ఆపై బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, పలమనేరు ఉన్నాయి. బైరెడ్డిపల్లె గురుకుల పాఠశాలకు చెందిన తన్మయి 592 మార్కులను సాధించి నియోజకవర్గలోనే టాపర్‌గా నిలిచింది. పెద్దపంజాణి పూలే బాలికల పాఠశాలకు చెందిన ధరణి 579 మార్కులతో రెండో స్థానం, పలమనేరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన అమూల్య 577 మార్కులతో మూడో స్థానం దక్కించుకుంది.

నియోజకవర్గంలో టెన్త్ ఫలితాలిలా...

మండలం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
పలమనేరు	718	581	89%
పెద్దపంజాణి	663	636	91%
బైరెడ్డిపల్లె	753	681	92%
గంగవరం	497	472	95%
వీకోట	1067	903	85%

నాడు-నేడుతో మా స్కూలు సూపర్



నాడు-నేడుతో మా స్కూల్ సూపర్‌గా ఉందిప్పుడు. మాకు యూనిఫామ్, షూలు, బ్యాగు, పుస్తకాలు, క్లాస్‌రూమ్‌లో డిజిటల్ బోర్డు, ట్యాబ్‌లు.. ఇలా కార్పొరేట్ స్కూళ్లను మించిన సౌకర్యాలున్నాయి. టీచర్లు బాగా పాఠాలు చెప్పేవారు.. నేను మండల టాపర్‌గా నిలవడానికి మా బడి, మంచిగా పాఠాలు చెప్పిన మా టీచర్లే కారణం.

–అమూల్య, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పలమనేరు

చక్కటి బోధన, సౌకర్యాలతోనే మంచి మార్కులు



ప్రభుత్వ స్కూళ్లు ఇప్పుడు చాలా బాగున్నాయి. మా ఫ్రెండ్స్ కొందరు ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఇక్కడికొచ్చి చేరారు. ముఖ్యంగా విద్యార్థులకు విద్యాసామగ్రి, ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన, అనుభవం ఉన్న టీచర్లు, చక్కటి సౌకర్యాల కారణంగానే నేను మంచి మార్కులు సాధించాను. అసలు మాబడిలో ఉన్నంత గ్రౌండ్ పలమనేరులో ఏ ప్రైవేట్ స్కూలోనైనా ఉందా?

–రెడ్డి రాహుల్, పలమనేరు హైస్కూల్

మారిన బడులతో దక్కిన ఫలితాలివి



నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్ల తీరుతెన్నులు మారాయి. విద్యార్థులకు సౌకర్యాలు, మంచి ప్రమాణాలతో కూడిన విద్యాబోధన ఇప్పుడు పదో తరగతి ఫలితాల్లో కనిపించింది. కార్పొరేట్ స్కూళ్లను మించిన సౌకర్యాలు ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో ఉన్నాయి. పిల్లలకు తల్లిదండ్రులందించే నిజమైన ఆస్తి చదువేనని ప్రభుత్వం భావించింది. ఓ రాష్ట్రం బాగుపడాలంటే అది ఆ రాష్ట్ర పాఠశాలలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడొచ్చిన ఫలితాలతో పిల్లల తల్లిదండ్రులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



పెద్దపంజాణి: టీడీపీ నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన 20 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే వెంకటేగౌడ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెంకటేగౌడకు, ఎంపీగా రెడ్డెప్పకు అండగా నిలబడి గెలిపించుకోవడానికి తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైస్ ఎంపీ జీడీబాబు, మండల కన్వీనర్ బాగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శి సుహేల్, నాయకులు క్రిష్టారెడ్డి, శేషాద్రి రెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు:పట్టణానికి చెందిన పలువురు యువకులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కండువాలను కప్పి ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీలోకి ఆహ్వానించారు. తాము జగన్‌మోహన్‌రెడ్డి పాలన మెచ్చి వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని చేరినట్టు ఐదోవార్డు రాజ్‌కుమార్, ఇస్మాయిల్, ఏడో వార్డుకు చెందిన సల్మాన్, 26 వార్డునుంచి నౌహీర్‌బాషా, టి.వడ్డూరుకు చెందిన ప్రసాద్ తెలిపారు.

28న అగ్రి డీలర్ల సమావేశం

పుంగనూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్రి డీలర్ల సమావేశం ఈనెల 28న పుంగనూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు విజయరెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణ సమీపంలోని భీమినేని ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీలర్ల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. డీలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

మా ఆయనను గెలిపించరూ!

- ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనీగౌడ ప్రచారం





వెంకటేగౌడను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న పావనీ గౌడ

వి.కోట: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటేనే కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని, ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెట్టాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనీగౌడ ఓటర్లను కోరారు. బుధవారం ఆమె మండలంలోని పెద్దభర్నిపల్లె పంచాయతీ కేంద్రంతోపాటు కమ్మేపల్లె, అధినేపల్లె, జంగంగురివేపల్లెలో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ ఓటర్లను కలిశారు. తన భర్తను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాను గుర్తుకు వేసి వెంకటేగౌడతోపాటు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను కూడా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో ఎన్నోసార్లు తన భర్త గ్రామాలకు వచ్చి, ప్రజలతో మమేకమై, సమస్యలు పరిష్కరించారని, అభివృద్ధి పనులు కూడా ఎన్నో చేశారని వివరించారు. టీడీపీ నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వస్తారని, వారు చెప్పే అబద్ధపు హామీలను నమ్మరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంపతులు యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, మండల మహిళాధ్యక్షురాలు శశికళ, సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు నరేంద్ర, భూపతి, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, మహిళానేతలు పాల్గొన్నారు.

వెంకటేగౌడ, రెడ్డెప్ప గెలుపు కోసం..

- జోరుగా ఇంటింటా ప్రచారం



గడ్డూరులో ప్రచారం చేస్తున్న మండీ సుధా

పలమనేరు: పేదల కష్టాలను తీర్చే జగనన్న పాలనే మళ్లీ రావాల్సిన అవసరం ఉందని పలమనేరు పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా అన్నారు. మున్సిపాలిటీలోని 12,18 వార్డుల్లో టీఎస్ అగ్రహారం, గడ్డూరులో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. మే 13న నిర్వహించే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యేగా వెంకటేగౌడ, ఎంపీగా రెడ్డెప్పను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం మండలంలో..

గంగవరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎన్నికల ప్రచారాలు ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ రెడ్డెప్ప అభ్యర్థి , ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కరపత్రాలతో ఇంటింటా అందజేసి జేసి ఓటర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం



పుంగనూరులో పీఆర్ఆర్ వారియర్స్ ప్రచారం



కౌన్సిలర్ల ప్రచారం



టైలర్ల ప్రచారం



పుంగనూరులో ముస్లిం నేతల ప్రచారం



సదుంలో నేతల ప్రచారం

పుంగనూరు: పట్టణంలోని రహమత్‌నగర్, యూబీ కాంపౌండులో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు. అలాగే పట్టణంలోని టైలర్ల సంఘ నేతలు ఖాసీమ్, నరసింహులు, సూరి, అస్లాం, మురేష్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అలాగే పీఆర్ఆర్ వారియర్స్ డాక్టర్లు ప్రభాకర్, శివ, శరణ్, సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, ఆవుల హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పి.ఎల్.శ్రీధర్, కృష్ణప్ప, శ్రీనివాసులు, నానబాల గణేష్, రెడ్డెప్ప, ఆర్‌కె.రామకృష్ణ, డాక్టర్ రమణరావు, బిటి.అతావుల్లా, రామచంద్ర కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే కుమ్మరవీధిలో కౌన్సిలర్ రేష్మా, మైనారిటీ నేతలు అస్లాంమురాది, మమ్ము, నిజాం ప్రచారం చేశారు. టైలర్లు బషీర్, అహమ్మద్, శ్రీనివాసులు, ఇస్మాయిల్, నిజాముద్దిన్, జావీద్, కరీప్మ, రాజా, రాజు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: జాండ్రపేటలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, బోయకొండ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నేతలు సయ్యద్ బాషా, ఇందాద్, ఇర్ఫాన్, షబ్బీర్, మల్‌రెడ్డి, కృష్ణ, చిన్న రమణ, రమేష్, మస్తాన్, శివారెడ్డి, వుల్లి రత్న పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కల్లూరులో బుధవారం ఇంటింటా వైఎస్సార్ సీపీ నేతలు కరపత్ర ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి అహ్మద్, షౌకత్‌అలీ, చంద్రశేఖరరెడ్డి, షారూక్, గోవిందరెడ్డి, షాజహాన్, నజీర్, అల్తాఫ్, ఎస్ఎం వల్లీ, రఫీ, ఫయాజ్, చైతన్య, అస్లాం, నిషార్, ఆమీన్, ముబారక్, మహబూబ్‌బాషా, నియంతుల్లా, షాహీనా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు

రొంపిచెర్లలో...

రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నేతలు సూర్యనారాయణరెడ్డి, శ్రీనాథ్, గుండ్లూరి రామచంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, సైపుల్లాఖాన్, అమరనాథరెడ్డి, మూరే రాజేంద్రరెడ్డి, చంద్ర, రవీంద్ర, లక్ష్మయ్య, రాంబాబు పాల్గొన్నారు.



రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లెలో నేతల ప్రచారం..,



బొమ్మయ్యగారిపల్లెలో..,



పులిచెర్ల: కల్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

సమోసా బాషా


ఆస్తుల్లేవ్
అప్పుల్లేవ్
ఉన్నదొక్కటే టీవీఎస్ ఎక్స్‌ఎల్
ఇదే నా జిందగీ

అంటూ స్వతంత్ర అభ్యర్థిగా బాషా అనే వ్యక్తి బుధవారం నామినేషన్ వేశాడు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సుల్లో సమోసాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తుండటం వల్ల సమోసాల బాషాగా ప్రయాణికులకు సుపరిచితం. తనకు చర, స్థిరాస్తులు, అప్పులు లేవని, చేతిలో పదివేల నగదు, తన టీవీఎస్ ఎక్సెల్ మాత్రమే ఉన్నట్టు అఫిడవిట్‌లో వెల్లడించాడు. నిరక్షరాస్యుడైన బాషా రాజకీయ నాయకుల మీటింగులో సమోసాలమ్ముకుంటూ వివిధ పార్టీల నేతలను దగ్గర నుంచి చూసి తాను కూడా ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆశతో నామినేషన్ వేసినట్టు చెప్పాడు. టౌన్‌లో సమోసాలమ్ముకుంటూనే కరపత్ర ప్రచారం చేస్తూ ఓట్లను అడుగుతానని నవ్వుతూ చెప్పాడు. –పలమనేరు



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సమోసాల బాషా

28న అనితరుడు పుస్తకావిష్కరణ



పలమనేరు: ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు రచించిన అనితరుడు పుస్తకావిష్కరణ ఈనెల 28న సాయినగర్‌లోని కళామందిరంలో నిర్వహించనున్నట్టు పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్ మాధవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహితీ ప్రపంచంలో 366మంది ప్రముఖులు రాసిన సమీక్ష, విమర్శ వ్యాసాల సంకలనమే ఈ అనితరుడు పుస్తకమని తెలిపారు. ముఖ్య అతిథిగా ద్రావిడ యూనివర్సిటీ వీసీ కొలకలూరి మధుజ్యోతితోపాటు పలువురు సాహితీ విమర్శకులు, కవులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.